రోడ్లపై గుంతలు.. ప్రజల ఇబ్బందులు

- నత్తనడకన సాగుతున్న జల్‌జీవన్ మిషన్ పనులు
- తాగునీటి కుళాయిల కోసం ఎదురుచూపులు
- నాణ్యత లోపంతో లీకేజీలు
- మండలంలో అస్తవ్యస్తంగా చేపడుతున్న పనులు

బెల్లంకొండ: ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలని సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం సహకారంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) పథకానికి ప్రాధాన్యత ఇచ్చింది. మండలంలోని ప్రతి ఇంటికి కుళాయిని ఏర్పాటు చేసి.. శుద్ధి చేసిన తాగునీరు అందించడమే ధ్యేయంగా కోట్లాది రూపాయల నిధులు కేటాయించింది. గత ప్రభుత్వంలో కొన్ని గ్రామాలలో పనులను ప్రారంభించి, నందిరాజుపాలెం గ్రామంలో పూర్తి చేశారు. అనంతరం ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో మిగిలిన గ్రామాలలో జలజీవన్ మిషన్ పనులను చేపట్టారు. కానీ గ్రామాలలో పనులు నత్తనడకన సాగుతూ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారాయి. కొన్నిచోట్ల అస్తవ్యస్తంగా గుంతలు తీసి వదిలి వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో రూ.4.75 కోట్ల నిధులు

మండలంలోని అన్ని గ్రామాలలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేసేందుకు రూ.4.75 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి. మన్నెసుల్తాన్‌పాలెం గ్రామానికి నిధులు విడుదల కాలేదు. ఎమ్మాజీగూడెం గ్రామం ముంపులో ఉండడంతో కుళాయిలు వేసేందుకు అనుమతులు లేవు. కాగా ఇప్పటివరకు చేపట్టిన పనులకు గాను రూ.1 కోటి వరకు కాంట్రాక్టర్లకు బిల్లులను మంజూరు చేశారు.


బెల్లంకొండ వద్ద పూడ్చని పైపులైను గుంతలు

అస్తవ్యస్తంగా పనులు

గత ప్రభుత్వంలో కొన్ని గ్రామాలలో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించి నందిరాజుపాలెం గ్రామంలో పనులను పూర్తి చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మరికొన్ని గ్రామాల్లో పనులను ప్రారంభించారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో గ్రామాల్లో నిర్మాణ పనులు నాసిరకంగా, అలస్యంగా జరుగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. పైప్‌లైన్ల నిర్మాణం కోసం సీసీ రోడ్లను పగలగొట్టి, కొన్నిచోట్ల సక్రమంగా పూడ్చి వేయకుండా అలానే వదిలివేయడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


నందిరాజుపాలెం వెళ్లే రహదారిపై వదిలేసిన పైపులైను గుంతలు


బెల్లంకొండలో మురుగుకాలువలో వేసిన పైపులు

అలాగే కొన్ని చోట్ల గుంతలను తవ్వి వాటిని పూడ్చకుండా వదిలివేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. కొన్నిచోట్ల నాసిరకమైన, నాణ్యత లేని పైపులను ఏర్పాటు చేయడంతో తొలి దశలోనే లీకేజీలకు గురవుతున్నాయి. కొన్ని గ్రామాలలో పైప్‌లైన్ల నిర్మాణాల కోసం పాత నీటి పైపులను తొలగించడంతో నీటి సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని గ్రామాలలో జల్‌జీవన్ మిషన్ పనులను సక్రమంగా, వేగవంతంగా జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మిర్చి నారుమళ్లలో తెగుళ్ల నివారణపై అవగాహన

అమరావతి: ప్రస్తుతం మిరప నారుమళ్లలో వచ్చే తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని నారుకుళ్లు, కానోఫోరా తెగులు, పైముడత, కింది ముడత, పొగాకు లద్దె పురుగుల ఉనికి ఎక్కువగా ఉంటుందని ఏవో ఎస్‌కే అహ్మద్ తెలిపారు. శుక్రవారం ఆయన రైతులకు నారుమళ్ల యాజమాన్యంపై సూచనలిస్తూ జూలై, ఆగస్టు నెలల్లో కురిసే వర్షాలకు నారుమడుల్లో నీరు నిలిచిపోయి నారుకుళ్ల తెగులు ఉధృతంగా వ్యాపిస్తుందన్నారు. దీని నివారణకు విత్తిన నాలుగైదు రోజులకు లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2 గ్రా. రిడోమిల్ కలిపి నాలుగైదు రోజులకు ఒకసారి రెండు మూడు పర్యాయాలు పిచికారీ చేయాలన్నారు. అధిక వర్షాలు కురిస్తే కానోఫోరా కొమ్మకుళ్లు తెగులు వృద్ధి చెందుతుందని, దీని నివారణకు లీటరు నీటికి 2 మి.లీ హెక్సాకొనజోల్ లేదా 3 గ్రా. ఆక్సీక్లోరైడ్ పిచికారీ చేయాలన్నారు. నారుమడుల్లో ట్రిపునిల్ గుళికలు వేస్తే 20 రోజుల వరకు పైముడత తెగులు ఆశించే అవకాశాలు తక్కువగా ఉంటాయని, నివారణకు లీటరు నీటికి 2 మి.లీ రీ జెంట్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు. కింది ముడత నివారణకు లీటరు నీటికి 2.5 గ్రా. నీటిలో కరిగే గంధకం, 5 మి.లీ డైకోఫాల్, 3 మి.లీ ఫోసలోన్ వంటి మందులను పిచికారీ చేయాలన్నారు.


ధరణికోటలో మిర్చి నారుమళ్లు

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

పెదకూరపాడు: దేశ స్వాతంత్ర్యం కోసం నిరంతరం పోరాడుతూ ప్రజల పక్షాన నిలబడిన ఏకైక పార్టీ సీపీఐ అని పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని 75 తాళ్లూరు సీపీఐ కార్యాలయంలో పెదకూరపాడు మండల సీపీఐ కార్యదర్శి పఠాన్ నాగుల మీరా అధ్యక్షతన నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించి, వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్న తరుణంలో సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయన్నారు. పేదల పక్షాన పోరాడే కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చల్లపల్లి పొనయ్య, పెదకూరపాడు పట్టణ సీపీఐ కార్యదర్శి నేలపాటి ఏసోబు, తాళ్లూరు సీపీఐ శాఖ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.


గోడప్రతులను ఆవిష్కరిస్తున్న సీపీఐ నేతలు

సీపీఎస్ రద్దు మహాసభను విజయవంతం చేయాలి

సత్తెనపల్లి: సీపీఎస్ రద్దుకై సెప్టెంబర్ 1న విజయవాడలో తలపెట్టిన మహాసభను విజయవంతం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్‌ఎం సుభాని పిలుపునిచ్చారు. పట్టణంలోని మండల విద్యావనరుల కార్యాలయం వద్ద శుక్రవారం మహాసభ వాల్ పోస్టర్లు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ సెప్టెంబర్ 1న విజయవాడలో జరిగే మహాసభ నిరసన కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ మిత్రులందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు చిన్నం శ్రీనివాసరావు, టి.రాజు, కటారి సురేష్, మోదుగుల అప్పారావు, శివారెడ్డి, జి.సునీల్‌బాబులు మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మహాసభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

తిరుపతమ్మ తల్లికి శ్రావణమాస బోనాలు



బెల్లంకొండ: శ్రావణ మాసం సందర్భంగా మండల కేంద్రంలోని యాదవ కాలనీ తిరుపతమ్మ ఆలయంలో అమ్మవారికి వైభవంగా భక్తులు బోనాలను సమర్పించారు. గ్రామంలోని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలను ఎత్తుకుని ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. జలబిందెలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు జలాభిషకాలను నిర్వహించారు. పొంగళ్లు చేసి నైవేద్యాలను సమర్పించారు. ఆలయ ధర్మకర్త నిడమానూరి ప్రసాదరావు ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందన



పెదకూరపాడు: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన అండర్‌-22 బాలికల వాలీబాల్ పోటీల్లో జీఆర్‌సీఆర్కే శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు పాఠశాల డైరెక్టర్ రాము, కవిత శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. 7 జిల్లాల స్థాయిలో జరిగిన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు రెండో స్థానం సాధించారన్నారు. సీనియర్ వాలీబాల్ ప్లేయర్, శాప్ డైరెక్టర్ అరికపూడి రమణరావు, వాలీబాల్ టీమ్‌ని అభినందించారు. పాఠశాలలో క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

అసెస్‌మెంట్ బుక్ విధానాన్ని రద్దు చేయాలి

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాసరావు

సత్తెనపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా ప్రవేశపెట్టిన అసెస్‌మెంట్ బుక్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పద్ధతిలో ప్రశ్నాపత్రాల విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని యూటీఎఫ్ సత్తెనపల్లి మండల శాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అసెస్‌మెంట్ బుక్ విధానంలో పరీక్షలు నిర్వహించడం వలన విద్యార్థులకు ఎటువంటి ప్రయోజనం కలగకపోగా ఉపాధ్యాయులు విలువైన బోధన సమయం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు కేటాయిస్తున్న బోధనేతర పనుల నుంచి వారిని తొలగించాలన్నారు. సత్తెనపల్లి శాఖ అధ్యక్షుడు పాలెపోగు రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి నంబుల విష్ణు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోషల్ సబ్జెక్టులో సిలబస్ తగ్గించాలన్నారు. సీనియర్ నాయకులు వెంకట్రావు, టాగూర్, నరసింహారావు, సురేష్, కిషోర్, శ్రీనివాసరెడ్డి, శేషిరెడ్డి, శేషగిరి, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత

బెల్లంకొండ: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకుని ఆ దిశగా విద్యనభ్యసించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గర్నెపూడి సునీత తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఫ్రెషర్స్ డే' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఇష్టంతో కష్టపడి చదివే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కళాశాలలో చదివి గొప్ప స్థాయికి వెళ్లిన విద్యార్థులు ఎందరో ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం గత విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బి.సౌమ్య, బి.అఖిలాబాయి, వీవీఐటీలో సీటు సాధించిన బండారు కళ్యాణిలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.కవిత, లక్ష్మీసులోచన, వై.రమేష్ బాబు, సాంబశివరావు కుసుమకుమారి, రత్నకుమారి, సత్యప్రభ, బాలునాయక్, పి.రమేష్, అంకమ్మ, అరుణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రిన్స్‌పాల్

చిరంజీవి సేవా గుణాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

సత్తెనపల్లి: చిరంజీవి సేవా గుణాన్ని స్ఫూర్తిగా తీసుకుని అభిమానులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శనీయమని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు అన్నారు. మండలంలోని ధూళిపాళ్ల జనసేన పార్టీ కార్యాలయంలో పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదినం సందర్భంగా జనసేన మండల అధ్యక్షుడు నాదెండ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్‌కుమార్, చిలుకా పూర్ణ, అభిమానులు తదితరులు ఉన్నారు.


కేక్ కట్ చేస్తున్న బొర్రా వెంకట అప్పారావు, అభిమానులు

కాప్స్‌రాక్స్ ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలు

నకరికల్లు: పట్టుదల, కృషితో సినీ, రాజకీయ రంగాలలో ఆదర్శనీయంగా ఎదిగిన గొప్ప వ్యక్తి చిరంజీవి అని డాక్టర్ సింగరాజు సాయికృష్ణ అన్నారు. చిరంజీవి పుట్టినరోజు వేడుకలను కాప్స్‌రాక్స్ పల్నాడు జిల్లా కో ఆర్డినేటర్ యర్రంశెట్టి మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో చల్లగుండ్లలోని వికలాంగుల పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దివ్యాంగులైన చిన్నారులకు అల్పాహారం, భోజనం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ స్వయంకృషితో ఎదిగిన చిరంజీవి ఎందరికో మార్గదర్శిగా నిలుస్తారని కొనియాడారు. కార్యక్రమంలో తిరుమలశెట్టి వెంకట్రావు, మిరియాల కోటేశ్వరరావు, రుసుం సైదారావు, సంగుల నాగేశ్వరరావు, పానాది రాంబాబు, సంగుల రామాంజినేయులు, తిరుమలశెట్టి చినరంగయ్య, యర్రంశెట్టి రమేష్, గాదె సాంబశివరావు, మారెళ్ల కోటేశ్వరరావు, మారెళ్ల శ్రీనివాసరావు, డీకొండ శ్రీనివాసరావు, ఆవుల సుబ్బయ్య, రుసుం కోటయ్య, సింగరాజు అంకారావు, మర్రివేముల సిద్ధయ్య, దాసరి వెంకయ్య, గోపిశెట్టి పాపారావు, పసుపులేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరంలో ఉచిత వైద్య శిబిరం

రుద్రవరం(ముప్పాళ్ళ): మండలంలోని రుద్రవరం గ్రామంలో చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కాటూరి మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ సహకారంతో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆసుపత్రి వైద్యులు పాల్గొని వైద్య సేవలందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాప్రోలు వెంకటకృష్ణారెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ బండెల శేషయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుపై గుంత... ప్రయాణికుల చింత!



పెదకూరపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రం మీదగా పాటిబండ్ల గ్రామానికి వెళ్లే కల్వర్టు ప్రమాదంగా మారింది. కల్వర్టు మధ్యలో పెద్ద గుంత ఏర్పడటంతో ఆ మార్గంలో ప్రయాణించే పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో గుంత కనిపించక అతివేగంగా వచ్చే ద్విచక్రవాహనదారులు గాయాల పాలవుతున్నారు. అధికారులు మరమ్మతులు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు. - పెదకూరపాడు

సూచనలు సరే.. అమలేది..?


పట్టణ శివారులో నీటిలో నానుతున్న ఖాళీ కొబ్బరి బొండాలు

- పట్టణంలో అపరిశుభ్రత కారణంగా జ్వరాల వ్యాప్తి
- దోమలు, దుర్గంధంతో ప్రజలు సతమతం
- రహదారికి ఇరువైపులా ఖాళీ కొబ్బరి బొండాలు

సత్తెనపల్లి: వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.. డ్రై డే పాటించాలి.. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నా క్షేత్ర స్థాయిలో అవి అమలు కావడం లేదు. పట్టణంలో ఎటు చూసినా అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. పారిశుధ్య కార్మికులతో చెత్త కుప్పలు శుభ్రం చేయించడం మినహా దోమలు, సీజనల్ వ్యాధుల నివారణకు యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. దాని ఫలితంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. వర్షాలు కురిసే సమయంలో అపరిశుభ్రత ఎక్కువై దోమలు, రోగాలు విజృంభిస్తున్నాయి. ఆసుపత్రులకు వెళ్లే వారి సంఖ్య పెరుగుతుంది. వర్షాకాలం ఆరంభం కావడంతో చిత్తడి ఎక్కువయి, వీధులు, లోతట్టు ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాలలో నీరు నిలిచిపోయి అపరిశుభ్రత ఏర్పడుతోంది. దీంతో దోమలు వ్యాప్తి పెరిగింది. సాధారణ సీజనల్ సమస్యలతో పాటు విష జ్వరాలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ చేపట్టాల్సి ఉంది. పట్టణంలోని పలు వార్డుల్లో ఇవేవీ కనిపించడం లేదు. దీనికి తోడు కొబ్బరి బొండాల వ్యాపారులు ఖాళీ కొబ్బరి బొండాలను పట్టణ శివారులోని జాతీయ రహదారికి ఇరువైపులా పోస్తుండడంతో అవి వర్షపు నీటిలో నానడం, వాటిని పగలగొట్టకపోవడంతో దోమలు వృద్ధి చెంది సాయంత్రం అయితే పట్టణాన్ని ముసురుకుని పట్టి పీడిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని పరిశుభ్రంగా ఉంచే ఏర్పాట్లు చేయాలని పుర ప్రజలు కోరుతున్నారు.

వైద్యశాలలో ద్విచక్ర వాహనం చోరీ

సత్తెనపల్లి: ద్విచక్ర వాహనం చోరీ జరిగిన ఘటన పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎడ్లపాడు మండలం ఉన్నవ గ్రామానికి చెందిన పత్తిపాటి నరేంద్ర తన కుమారుడు అస్వస్థతతో ఉండటంతో ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం చేయించేందుకు వచ్చాడు. ఈ క్రమంలో తన ఏపీ 07 బీజడ్ 6067 గ్లామర్ ద్విచక్ర వాహనాన్ని వైద్యశాల ప్రాంగణంలో పార్క్ చేశాడు. వైద్య సేవల అనంతరం బయటకు వచ్చి చూడగా ద్విచక్ర వాహనం కనిపించ లేదు. గుర్తు తెలియని దుండగులు అపహరించారని నిర్ధారించుకొని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఉచిత యోగ క్లాసులు

మాచర్ల: పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఆశ్రమంలో యోగ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మెట్టు గోవిందరెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం మహిళలు, సాయంత్రం పురుషులకు ఉచిత తరగతులకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. వివరాలకు 9440006813 సంప్రదించాలని కోరారు.

బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా మేకల హనుమంతరావు

అమరావతి: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ నియామకాలలో భాగంగా అమరావతి మండలానికి చెందిన మేకల హనుమంతరావును శుక్రవారం రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రకటించారు. నూతనంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితుడైన హనుమంతరావును బీజేపీ పల్నాడు జిల్లా మాజీ అధ్యక్షుడు ఆలోకం సుధాకరబాబు, బీజేపీ నాయకులు మద్ది ధాత్రినారాయణ, నేరెళ్ళ హనుమంతరావు, గోగినేని వెంకటరమణలతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు అభినందించారు.

రేపు మార్కెట్‌యార్డు పాలకవర్గ ప్రమాణస్వీకారం

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గ క్రోసూరు మార్కెట్‌యార్డు నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం ఈ నెల 24వ తేదీన జరుగుతుందని యార్డు కార్యదర్శి ఈశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సమక్షంలో యార్డు చైర్మన్‌గా షేక్ జరీనా, పాలకవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తారన్నారు.

క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతో దోమలకు చెక్



రాజుపాలెం: మండలంలోని మొక్కపాడులో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రతపై ఆరోగ్య సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే దోమలు వృద్ధి చెందవని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివమాధవి, హెల్త్ అసిస్టెంట్ షరీఫ్, ఏఎన్‌ఎం మూడావత్ దుర్గా, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నార్నెపాడులో రీసర్వే గ్రామ సభ

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో రీ సర్వేలో భాగంగా ముసాయిదా డ్రాఫ్ట్ లాండ్ రికార్డుపై శుక్రవారం గ్రామ సభ జరిగింది. గ్రామసభలో తహసీల్దార్ కె.నగేష్ పాల్గొని రీసర్వే వివరాలను రైతులకు వివరించారు. ఇంకా కొంతమంది రైతులకు సంబంధించిన భూముల రికార్డులు నమోదు కావాల్సి ఉందని, చిన్నపాటి సమస్యలతో ఆలస్యమైందన్నారు. రీసర్వే జరిగిన అన్ని రకాల భూముల వివరాలు రికార్డులలో నమోదు చేయటం జరిగిందని, రైతులు పరిశీలించుకోవచ్చన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత వీఆర్వో దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. భూముల వివరాలన్నీ పూర్తి స్థాయిలో నమోదు చేపట్టడం జరుగుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామ సభలో డిప్యూటీ తహసీల్దార్ బాలవెంకటేష్, మండల సర్వేయర్ రాజు, ఆర్‌ఐ ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సొసైటీల పాత్ర కీలకం



సత్తెనపల్లి: గ్రామాల అభివృద్ధిలో కో ఆపరేటివ్ సొసైటీల పాత్ర ఎంతో కీలకమని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ధూళిపాళ్ల గ్రామంలో ది ఆంధ్ర బ్యాంక్ రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ చైర్మన్‌గా కంచేటి సుబ్బారావు, మెంబెర్లుగా గణేషు రతయ్య, చల్లా కుటుంబయ్య శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కన్నా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కొత్తగా నియమితులైన సొసైటీ ప్రతినిధులు గ్రామ సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సొసైటీలో బకాయిలు త్వరగా చెల్లించేలా చూడాలని సూచించారు. సహకారం సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, జనసేన నాయకుడు బొర్రా వెంకట అప్పారావు, నాయకులు దరువూరి నాగేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరావు, తోట అంబిక, నాదెండ్ల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

గణేష్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ఎస్‌ఐ డి.ప్రవీణ్

బెల్లంకొండ: వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామాలలో గణేష్ విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ డి.ప్రవీణ్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఉత్సవాల నిర్వాహకులు ముందస్తుగా పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం, ఎన్ని రోజులు ఉత్సవాలు నిర్వహించే వివరాలను తెలియజేయాలని సూచించారు. తద్వారా సమస్యాత్మక ప్రదేశాలలో పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎవరికీ ఇబ్బందులు లేకుండా పూజలు జరుపుకోవాలని, అధిక శబ్దంతో మైకుల ఏర్పాటు నిషేధమని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆఖరి శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు



క్రోసూరు: శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా క్రోసూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, ఆర్యవైశ్య మహిళలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మీవ్రతాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.